


# నవభూమి

## జిల్లా అనుబంధం

21 ఫిబ్రవరి,2025 శుక్రవారం పేజీలు:6

www.epaper.navabhoomi.in


# పలుగు పట్టిన కలెక్టర్

## ❑ టేకులపల్లి మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**టేకులపల్లి ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ టేకులపల్లి మండలంలో గురువారం విస్తృత పర్యటన జరిపారు. సులానగర్ గ్రామంలో రైతు అరవ రమాదేవి ఫారం పాండు పనిని పరిశీలించి కూలీలతోపాటు తను స్వయంగా సుమారు 20 నిమిషాల పాటు పనిచేశారు. కూలీల సమస్యలు, పనిముట్లు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత కోయగూడెం గ్రామపంచాయతీలో రైతు భూక్యా పకీరా సాగు చేస్తున్న మునగ తోటను పరిశీలించి, రైతుతో సస్యరక్షణ చర్యలు, మార్కెటింగ్ గురించి అడిగి





తెలుసుకున్నారు. రైతులకు ఫారం పాండు నిర్మాణం, మునగ తోటల పెంపకం గురించి అవగాహన కల్పించడం జరిగింది. చింతలంక గ్రామంలో ఏర్పాటుచేసిన నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి మొక్కల పెంపకంపై పలు సూచనలు చేసినారు. తర్వాత చంద్రు తండ గ్రామంలో ఆయిల్ పామ్ పంటను, సాగు చేస్తున్న రైతు ధర్మ తోటను పరిశీలించి రైతుకు, గ్రామస్తులకు ఫారం పాండు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలు, మునగ తోటలు సాగు చేయడం వల్ల కలిగే ఆర్థిక లాభాల గురించి రైతులకు వివరించారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూములకు విద్యుత్ సమస్యను గురించి రైతులతో మాట్లాడడం జరిగింది. గ్రామంలో ఉన్న మంచినీటి సమస్య రహదారి సమస్య పైన అధికారులను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జరిగిన, జరుగుతున్న పనులు, నర్సరీ మంచిగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా పెద్ద మొత్తంలో రైతులకు మునగ సాగుపైన, ఫారం పాండు నిర్మాణాలపైన విస్తృతంగా ప్రచారం చేసి, వారి చేత పనులు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి రమణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గడదాసు రవీందర్, తహసిల్దార్ నాగభవాని, మండల పంచాయతీ అధికారి లక్ష్మీ గణేష్ గాంధీ, ఉపాధి పథకం అదనపు కార్యక్రమ అధికారి



కాలంగి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మొగిలి తిరుపతయ్య, కార్యదర్శులు సిద్ధాంతి చిట్టి, రూబీనా బేగం, పవిత్ర, గోపాలకృష్ణ, కృష్ణ, చైతన్య, వసంతరావు, మహేష్, సాంకేతిక సహాయకులు భీముడు, స్వప్న, వెంకటరమణ, క్షేత్ర సహాయకులు లకన్, బాలాజీ, శిరోమణి, వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ, విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు, పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలిసే శ్రమిద్దాం

## ❑ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల భారిన పడిన వారి కుటుంబ సభ్యులు అనాధలవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్అండ్బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్




నిర్వహించాలని పోలీసు శాఖను ఆదేశించారు. జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో శ్రమిద్దామని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ భద్రాచలం చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఈఈ లు కొత్తగూడెం, భద్రాచలం వెంకటేశ్వర్లు, లాల్ సింగ్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఇల్లందు శ్రీకాంత్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీవో వెంకటరమణ, ఎం వి ఐ వెంకట పుల్లయ్య, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, డి ఎం హెచ్ ఓ భాస్కర్ నాయక్, నేషనల్ హైవే డిఈ శైలజ, మెడికల్ డిపార్ట్మెంట్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అశ్వాపురం మండల వ్యవసాయశాఖ అధికారి

**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** 'అశ్వాపురం మండల వ్యవసాయ శాఖాధికారి డి సాయి శంతన్ కుమార్ రైతు నుండి రూ.30 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో దాడి చేసి వ్యవసాయ అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒక రైతుకు పత్తి అమ్ముకునేందుకు కూపన్ ఇవ్వడానికి రూ.30 వేలు డిమాండ్ చేసి, గురువారం మధ్యాహ్నం రూ.30 వేలు రైతు తెచ్చిన డబ్బులు తన లాప్ టాప్ బ్యాగులో పెట్టించుకున్నారు. అదే సమయంలో ఏసీబీ



అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు




విద్యార్థులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ఖాన్, చిత్రంలో డీఐఈఓ రవిబాబు తదితరులు

# పోటీ పరీక్షల పుస్తకాల కోసం మలబార్ 3.80లక్షల అందజేత

**ఖమ్మం-నవభూమిబ్యూరో:** విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్యే ప్రధాన ఆయుధమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ అన్నారు. ఖమ్మం ఏఎస్ఆర్ శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బాగా చదివి, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి, మరో నలుగురికి తోడ్పడాలని కోరారు. కళాశాలలో పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం అవసరమైన శిక్షణ పుస్తకాలు అందించేందుకు మలబార్ గోల్డ్ ఛారిటబుల్ సంస్థ వారు నగదు ప్రోత్సాహకం రూ.3.80 లక్షల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు, ప్రిన్సిపల్ గోవిందరావు, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం

## స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య



**ఖమ్మం, నవభూమి ఫిబ్రవరి 20 :** జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యంగా పనిచేయాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య అన్నారు. ఖమ్మం నగరంలో గురువారం జరిగిన స్వేరోస్ సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య ప్రకటించారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా మొండితోక ఈదయ్య, కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా తగరం శ్రీకాంత్, మహేష్, గోవిందరాజు, కోశాధికారి రమణ, అధికార ప్రతినిధి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిలు సుధాకర్, వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధవి, కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నరసింహరావు, కృష్ణయ్య, మల్సూర్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య మాట్లాడుతూ... జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ పనిచేయాలని పిలుపునిచ్చారు.

# హీరో సందీప్ కిషన్ పీపుల్ స్టార్ బిరుదును మార్చుకోవాలి

## పీపుల్ స్టార్ బిరుదు నారాయణమూర్తి అన్నదే



**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:**–సినీ చిత్ర పరిశ్రమలో పీపుల్ స్టార్ అంటే అది సామాజిక, అభ్యుదయ చిత్రాల దర్శకుడు హీరో ఆర్ నారాయణ మూర్తి పేరు గుర్తుకొస్తుందని, పాటల రచయిత జలాల్ అన్నారు. మొదటి సినిమా నుంచి ప్రస్తుతం సినిమాల వరకు ఎక్కడా కమర్షియల్ హంగు ఆర్భాటాలు లేకుండా సామాన్య కళాకారులను తీసుకొని ప్రజా సమస్యల సినిమాల ద్వారా చర్చ కు పెడుతూ నికార్సుగా సినిమాలు తీస్తున్న హీరో నారాయణ మూర్తి కే పీపుల్ స్టార్ట్ తగినదన్నారు. దాన్ని కూడా హైజాక్ చేయాలనుకోవడం తెలుసో తెలియకో మజాకా సినిమా ద్వారా పీపుల్ స్టార్ అనే బిరుదును సందీప్ కిషన్ పెట్టుకోవడం బాధాకరం అని ఆయన అన్నారు. పీపుల్ స్టార్ అనే బిరుదు నారాయణమూర్తి అన్న ఉండగా ఇంకొకరు పెట్టుకోవడం అభ్యంతరకరమే. నారాయణమూర్తి పెద్ద మనసుతో ఒప్పుకున్న అడిగి పెట్టుకున్న అది ఆమోదయోగ్యం కాదని ఎందుకంటే మెగాస్టార్, పవర్ స్టార్, రెబల్ స్టార్ ఇలా ఈ స్టార్లు కూడా ఇతరులు పెట్టుకుంటే ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. సందీప్ కిషన్ కావాలనుకుంటే ఇతర పెద్ద హీరోల ఏదో ఒక బిరుదు తీసుకొని ముందుకు పోవాలని ఆయన కోరారు.

# వరి పంట బోనస్ రైతు బ్యాంక్ ఖాతాలో వెంటనే జమ చేయాలి

**వీపనగండ్ల ఫిబ్రవరి 21 నవభూమి–** వీపనగండ్ల మండలం సిపిఎం బొల్లారం గ్రామ కార్యకర్తల సమావేశం సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరి పంటకు బోనస్ ఇస్తామని ప్రకటించడం జరిగింది. క్వింటాల్ కు 500 రూపాయలు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగింది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ప్రారంభంలో మాత్రమే10 శాతం రైతులకు మాత్రమే వరి బోనస్ డబ్బులు ఇవ్వడం,90 శాతం రైతులకు ఇప్పటికీ వరి బోనస్ డబ్బులు రాక ఆందోళన గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే ప్రతి రైతుకు, వరి బోనస్ డబ్బులు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ కూడా 45 శాతం రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాక ఆందోళనలకు గురవుతున్నారని. రైతు భరోసా మూడు ఎకరాలకు వరకు వేశామని చెప్తున్నారు కానీ ఇప్పటికీ 30% పైగా రైతులకు మూడెకరాల్లో ఉన్న రైతులకు కూడా అందలేదన్నారు

# సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమించక తప్పదు

- పెన్షనర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య
- పెండింగ్ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన సమావేశం





**సత్తుపల్లి, నవభూమి, ఫిబ్రవరి 20 :** బి ఆర్ ఎస్ ప్రభుత్వం రాష్ట్ర లో అధికారంలో ఉండగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించిందని అందుకే తగిన మూల్యం చెల్లించు కుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. గురువారం పెన్షనర్ల సంఘం భవనంలో పెన్షనర్స్ డే ను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం సత్తుపల్లి యూనిట్ అధ్యక్షులు కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మార్చి నెల వరకు గడువు కోరిందన్నారు.అందుకే వేచిచూస్తున్నామ న్నారు. సమస్యల పరిష్కార విషయంలో ప్రభుత్వ నిర్ణయాలలో మార్పు రాకపోతే ఆ తరువాత ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని కళ్యాణం కృష్ణయ్య అన్నారు. గత ప్రభుత్వాన్ని మార్చడంలో విశ్రాంత ఉద్యోగులు క్రియాశీల పాత్ర వహించారన్నారు.ముఖ్యంగా వృద్ధాప్య దశలో వచ్చే వ్యాధుల చికిత్సకు ఉపయోగ పడే ఆరోగ్య పథకాన్ని అమలు చేయక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి శరత్ బాబు మాట్లాడుతూ పెన్షన్ భారం నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పించుకునే ధోరణితో సిపియస్,యుపియస్.వంటి పథకాలను అమలు పరచే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు.దశాబ్దాల తరబడి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి వృద్ధాప్య దశలో ఆదుకోవలసిన బాధ్యత ఇరు ప్రభుత్వాలపై ఉందన్నారు.ఉద్యోగులు,పెన్షనర్ల చెల్లింపులకు ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న 'ఈ కుబేర్' విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు.సంవత్సరాల తరబడి నిధులు మంజూరు కాక రిటైరైన వారు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్స్ డే కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సర కాలంలో ఉద్యోగ విరమణ చేసిన 27మంది వివిధ శాఖల విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. సమావేశంలో ఇంకా హెల్త్ కార్డులు మంజూరు చేసి ఈహెచెస్ పథకం అమలు చేయాలన్నారు.ఈ కుబేర్ విధానం తొలగించి జిల్లా పరిధిలోనే నిధులు విడుదల చేయాలన్నారు. ఓల్డ్ పెన్షన్ విధానం అమలు పరచాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు చెంచిరెడ్డి,రఘుపతి రెడ్డి, సత్తుపల్లి యూనిట్ నాయకులు బద్రుద్దీన్, ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం,రామిశెట్టి సుబ్బారావు,బూరుగు దాసు,సీతయ్య, సాంబశివరెడ్డి, మధుసూదన రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పారావు మృతి సిపిఐ పార్టీకి తీరని లోటు

- ఖమ్మం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి దండి సురేష్





**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 20:** కామ్రేడ్ పల్లపాటి అప్పారావు మృతి సిపిఐ పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరనిలోటని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో అప్పారావు సంస్మరణ సభను మారుతీ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఏర్పాటు చేసిన చిత్రపటానికి అక్కడి సిపిఐ శ్రేణులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ...అనేక అవాంతరాలు ఎదురైనప్పటికీ తను నమ్మిన ఎర్రజెండా కోసం తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో ముందుండి ఎర్ర సైనికులను నడిపించే వారన్నారు. అలాంటి వ్యక్తి చిన్న వయసులో మృతి చెందడం ఎంతో బాధాకరం అన్నారు. యువత అప్పారావు ఆశయ సాధన కోసం కృషి చేసిన నాడే మనం ఇచ్చే ఘనమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తి నాయక్, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు బానోతు రాంకోటి, బానోతు రామ్మూర్తి, బండి ఉపేందర్, మాధవరావు, కర్ణం పెద్ద ఉపేందర్, ఎర్రబోయిన వెంకట నరసయ్య, పోడేటి అంజయ్య, బండి రమణ, ఎర్రబోయిన వెంకటనారాయణ, మారుతి నరేష్, నాగేందర్, ఎలుటూరి పున్నయ్య, శంకర్, నవీన్, కర్ణం చిన్న ఉపేందర్, పోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# శ్రీరాం సాగర్ నీటిని పాకాల ఏటిలోకి విడుదల చేయాలి

**గార్ల, నవభూమి, ఫిబ్రవరి 20:** పాకాల ఏటిలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టె బోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఐ గార్ల మండల కమిటీ సమావేశం లావుడ్య భీముడు అధ్యక్షతన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకాల ఏటి పరివాహక ప్రాంతం రైతులు రబీ పంటలు వేశారని, పాకాల ఏరు పూర్తిగా అడుగంటి పోతుండటంతో సాగు నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంభందిత అధికారులు రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.దీనితో సాగునీటి తో పాటు తాగు నీరు కూడా అందుతుందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న,మాగం లోకేష్, ఇరుగు వెంకటేష్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.



# పోక్సో కేసులో నిందితులకు జీవిత ఖైదు

### రూ.2,10,000/- జరిమానా

**ఖమ్మం, క్రైం, నవభూమి, ఫిబ్రవరి 20 :**ఇంటి బయట ఆడుకుంటున్న పన్నెండు ఏళ్ల బాలికను మాయమాటలతో కిడ్నాప్ చేసి లైంగికదాడికి ఒడిగట్టిన నిందితులకు జీవితకాల కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండు లక్షల పది వేల రూపాయలు జరిమానాలు విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా జడ్జి కె. ఉమాదేవి గురువారం తీర్పు వెల్లడించారని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఫిబ్రవరి 7 న ఇంటి బయట అడుకుంటున్న బాలిక వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చి మాయమాటలతో బలవంతంగా మోటార్ సైకిల్ పై తీసుకెళ్లి నగర శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ లో పోస్కో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఈ కేసు విచారించిన జడ్జి బాలిక కిడ్నాప్ లైంగికదాడికి పాల్పడిన ఖమ్మం రమణ గుట్ట ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కాలేపల్లి సంపత్, అతనికి సహకారించిన మరో నిందుతుడు మంచి కంటి నగర చెందిన పెయింటర్ పసువుల నవీన్ లకు జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండు లక్షల పది వేల రూపాయలు జరిమానాలు విధించారని తెలిపారు. ఈ సందర్భంగా కీలకమైన కేసులోని నిందుతులు నేరం నుండి తప్పించుకోకుండా ప్రాసిక్యూషన్ తరపున వాదించి నిందుతులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఏ.శంకర్, ఇన్స్పెక్టర్ వెంకన్న బాబు, ప్రస్తుతం డిఎస్పీ ఇంటిలిజెన్స్, ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రావు, నాగేశ్వరరావు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. భవిష్యత్తులో కేసుల నుండి నిందుతులు తప్పించుకోకుండా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

# పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన





**పాల్వంచ టౌన్ ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో గురువారంను పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్. రజినీకుమారి ఆదేశాల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పముల తో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి మంత్రపుష్పం నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. ఈనెల 26న ఆలయంలో రుద్ర హోమం మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26 బుధవారంరోజున రుద్ర హోమం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు స్వామి వారి కళ్యాణం ఆలయ ఆవరణంలో త్యాగశాలలో అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 6303408458 వారికి సంప్రదించాలని అన్నారు.

# మాతృభాష మృత భాష కారాదు

- విశ్వశాంతిలో మాతృభాషా దినోత్సవం
- మాతృభాష పట్ల అవగాహన కార్యక్రమాలు



**సత్తుపల్లి నవభూమి ఫిబ్రవరి 20 :**ఒక భాషను చదవటం ,రాయటం, మాట్లాడటం మరచిపోతే కాలక్రమేణా అది మృత భాషగా మారుతుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21ని పురస్కరించుకొని విశ్వశాంతి విద్యాలయం లో గత రెండు రోజులుగా విద్యార్థులకు మాతృభాష పట్ల అవగాహన కొరకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులుగా పుస్తకాలు అందజేశారు. 100 వేమన పద్యాలను చూడకుండా అనర్గళంగా అప్పగించిన 25 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ బెంగాల్లో మాతృభాష అమలు కోసం పాకిస్తాన్ కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన బెంగాలీ విద్యార్థుల త్యాగాలకు నివాళిగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న ప్రపంచ మాతృభాష దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎమెస్కో పిలుపు మేరకు 1999 నుంచి ప్రపంచవ్యాప్తంగా 188 దేశాలు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో సుమారు 7000 భాషలు ఉండగా వాటిలో 2400 భాషలు అంతరించిపోవడం జరిగిందన్నారు. మాతృభాష చదవటం ,రాయటం, మాట్లాడటం తగ్గడం వలనే ఈ దుస్థితి కలిగినట్లు వివరించారు. భవిష్యత్తు అవసరాల దృశ్య ఆంగ్లము తదితర పర భాషలు నేర్చుకుంటున్నప్పటికీ మాతృభాషను మరవకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శైలజ, రమణమూర్తి, మణి , రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధమిక విద్యే విద్యార్థుల భవితకు పునాది

- ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు
- ముగిసిన మండల స్థాయి ప్రతిభా పరీక్ష, క్విజ్ పోటీలు



**సత్తుపల్లి, నవభూమి, ఫిబ్రవరి 20 :** విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధమిక విద్యే పునాది వారిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభా పాఠవాలను వెలికి తీసి సృజనాత్మకతకు పదును పెడుతూ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని మండల విద్యాధికారి నక్కా రాజేశ్వరావు కోరారు.గురువారం సత్తుపల్లి పాత సెంటర్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సంధర్బంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సామర్థ్యాలను మెరుగు పరచడం ద్వారా వారి మేధా శక్తిని పెంపొందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడంలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషించాలన్నారు.ఈ ప్రతిభా పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తామని ఆయన అన్నారు.ఉపాధ్యాయులందరూ తమ పిల్లలని ఈ పోటీలకు సంసిద్ధులను చేస్తూ కొత్తగా చేరబోతున్న ఉపాధ్యాయులకు ప్రేరణ కలిగించాలని కోరారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహణకు, బహుమతులకు 10 వేల రూపాయలు అందజేసిన సిద్దారం పాఠశాల హెచ్.ఎం బాలయ్య ను సన్మానించారు.అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్లు శైలకుమారి, యాకూబ్, జయరాజు ,సెక్రటరీ సుధాకర్ రెడ్డి,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ విభాగంలో ఎన్టీఆర్ నగర్ ప్రాధమిక పాఠశాల, కోట తుంబూరు ప్రాధమిక పాఠశాల ప్రధమ స్థానం సాధించగా యూ.పీ. ఎస్ రుద్రాక్షపల్లి ద్వితీయ, గాంధీనగర్ పాఠశాల తృతీయ స్థానం పొందాయి. టాలెంట్ టెస్ట్ విభాగంలో 5వ తరగతిలో గంగరాం హెచ్.డబ్ల్యూ ప్రధమ, యూ.పీ.ఎస్ సిద్దారం, ఎన్టీఆర్ నగర్ పాఠశాలలు ద్వితీయ,రుద్రాక్షపల్లి,కోట తుంబూరు పాఠశాలలు తృతీయ బహుమతి పొందాయి. 4వ తరగతిలో ఎన్టీఆర్ నగర్ ప్రాధమిక పాఠశాల ప్రధమ, పీ.ఎస్ సత్తుపల్లి ద్వితీయ,ఎన్టీఆర్ నగర్ తృతీయ స్థానాలు సాధించాయి. 3వ తరగతిలో బూరుగు మాలపల్లి ప్రధమ,పీ.ఎస్ సత్తుపల్లి ద్వితీయ, కాకర్లపల్లి హెచ్.డబ్ల్యూ తుతీయ స్థానాలు పొందాయి.

## యూనిట్ సభ్యులకు సబ్సిడీ కింద మంజూరైన చెక్కును

# అందజేసిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్



**భద్రాచలం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** నిరుద్యోగ గిరిజన యువతి,యువకులు ఐకమత్యంతో కలిసికట్టుగా ఉండి స్వశక్తితో కుటీర పరిశ్రమలు నెలకొల్పుకొని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకొని ఆర్థికంగా వెసులుబాటుతో జీవనోపాది కల్పించుకొని పదిమందికి ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం నాడు ఆళ్లపల్లి మండలం శ్రీ ధనలక్ష్మి ఫయాశ్ బ్రిక్స్ యూనిట్ సభ్యులకు సబ్సిడీ కింద మంజూరైన చెక్కును అందించి ఇటుకలు తయారు చేసే విధానాన్ని మరియు ఇటుకల కొరకు వాడే యాష్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులైన గిరిజన యువతి, యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వస్శక్తితో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని జీవనోపాధి పెంపొందించుకోవడానికి గిరిజన యువకులు నలుగురు 15 లక్షల సబ్సిడీతో 25 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసుకున్న శ్రీ ధనలక్ష్మి ఫయాశ్ బ్రిక్స్ యూనిట్ను గిరిజన యువతి, యువకులు సమన్వయంతో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుగాని జీవనోపాధి పెంపొందించుకోవడం చాలా సంతోషకరమని అన్నారు గిరిజన యువతి,యువకులు యూనిట్ ను నడుపుకొని జీవనోపాధి పెంపొందించుకోవడానికి 25 లక్షల యూనిట్ కాస్ట్ తో శ్రీ ధనలక్ష్మి ఫయాశ్ బ్రిక్స్ యూనిట్ నెలకొల్పుకొని దాని ద్వారా తయారుచేసిన ఇటుకలను మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకొని అమ్మకాలు జరుపుకొని లబ్ధి పొందాలని అన్నారు. ఇటుకల తయారీ కోసం మరియు సిమెంటు సొంతంగా తామే కొనుగోలు చేసుకుని నాణ్యత గల ఇటుకలు తయారుచేసి సరసమైన ధరలకు అమ్ముకోవాలని అన్నారు. శ్రీ ధనలక్ష్మి ఫయాశ్ బ్రిక్స్ యూనిట్ యూనిట్ నెలకొల్పుటకు 25 లక్షలు యూనిట్ కాస్ట్ కాగా 15 లక్షలు సబ్సిడీ లభించిందని, 2.5 లక్షలు బెనిఫిషర్ కంట్రిబ్యూషన్ తో యూనిట్ను ఏర్పాటు చేసుకున్నామని, 7.5 లక్షలు బ్యాంకు రుణము లభించిందని, దానితో శ్రీ ధనలక్ష్మి ఫయాశ్ బ్రిక్స్ యూనిట్ ను అభివృద్ధి చేసుకుంటామని గిరిజన యువతి,యువకులు పిఓకి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, ధనలక్ష్మి బ్రిక్స్ యూనిట్ సభ్యురాలు శ్రీమతి సుశీల, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలపై అవగాహన కలిగించాలి



**గార్ల, నవభూమి, ఫిబ్రవరి 20:** ప్రభుత్వ ఆసుపత్రి ల్లో సాధారణ ప్రసవాలపై గర్భిణీ లకు అవగాహన కలిగించాలని వైద్య, ఆరోగ్య శాఖ మహబూబాబాద్ జిల్లా గార్ల నోడల్ అధికారి రాజ్ కుమార్ జాదవ్ వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండలం పరిధిలోని ముల్కనూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో గురు వారం నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాలు సురక్షితం, శ్రేయస్కారమని, తల్లి గర్భం దాల్చిన నాటి నుండి బిడ్డ ప్రసవించే వరకు గర్భిణీ స్త్రీలకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందించాలన్నారు. పెద్ద బరువులు ఎత్తడం, రేడియేషన్, ఎక్స్ రే లకు ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని గర్భిణీ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ విజయ లక్ష్మి, ఏ ఎన్ ఎం లు వినోద, శోభ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** మార్చి 5 నుండి ప్రారంభ మయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి సమావేశం నిర్వహించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలోకి ఎవరు సెల్ఫోన్ తీసుకొని వెళ్లడానికి అనుమతి లేదని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్ లలో బస్సు సర్వీసులు నడిచేలా చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో ఒక ఏఎన్ఎంను కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు తదితర మౌలిక వసతులు ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను చేర్చడం ద్వారా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల ఏరియాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన నిఘా ఉండాలని, ఇందుకు గాను కస్టోడియన్, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ఏ ఆర్ డి ఎస్ పి సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సులోచన రాణి కొత్తగూడెం ఇల్లందు పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు శేషంజన్ స్వామి, శ్రీకాంత్,సుజాత పాల్గొన్నారు

# యూనిట్ సభ్యులకు శిక్షణ ముగింపు కార్యక్రమం

■ పాల్గొన్న సిఐఓటి డైరెక్టర్ ఉదయ్ కుమార్






**భద్రాచలం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని జీవనోపాధి పొందుతున్న యూనిట్ సభ్యులు లాభనష్టాలను, బలాలు బలహీనతలు బేరీజు వేసుకొని అందరూ ఐకమత్యంతో కలిసికట్టుగా ఉండి పరిశ్రమలు నడిపిస్తే లాభాల బాటలో నడుస్తాయని సిఐఓటి డైరెక్టర్ ఉదయ్ కుమార్ ఎం ఎస్ ఎం ఈ యూనిట్ సభ్యులకు సూచించారు. గురువారం నాడు వైటీసీలో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఎం ఎస్ ఎం ఈ యూనిట్ సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు సక్రమంగా నడవాలంటే తప్పనిసరిగా యూనిట్ సభ్యులందరూ బాధ్యతగా తమకు సంబంధించిన పనులు సక్రమంగా నిర్వహిస్తే ప్రతి పరిశ్రమ లాభాల బాటలో నడుస్తుందని, సభ్యులు ముఖ్యంగా తయారు చేసే వస్తువులు మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకోవడానికి అందరితో పరిచయాలు పెంచుకోవాలని, ముడి సరుకులు కొనుగోలు చేసిన దగ్గర నుండి తయారుచేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రికార్డులలో నమోదు చేయాలని, పరిశ్రమలు పెట్టుకున్నా యూనిట్ సభ్యులు అందరూ ఒక దగ్గర ఉండకుండా మార్కెటింగ్ సౌకర్యం కొరకు కొందరు, ముడి సరుకులు కొనుగోలు కొరకు కొందరు, గ్రామాలలో పరిచయాలు పెంచుకోవడానికి కొందరు రికార్డులు మెయింటైన్ చేయడానికి కొందరు తలా ఒక పనులు పంచుకోవాలని, యూనిట్ సభ్యులు అందరూ కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని ఖర్చుల వివరాలు లాభనష్టాల వివరాలు చర్చించుకోవాలని అన్నారు. ఈ మూడు రోజుల శిక్షణలో మార్కెటింగ్, క్రియేటివిటీ, మీలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు నడిపించుకుంటే ప్రతి పరిశ్రమ లాభాల బాటలో నడుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, సి ఐ ఓ టి శిక్షకుడు విజయ్ కుమార్, భవిత సెల్ సిబ్బంది మణి కుమారి, సమ్మయ్య, దినేష్ 25 యూనిట్ కి సంబంధించిన 30 మంది సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాల మేళాలు విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి కృషి

■ విద్యాశాఖ అధికారి టి రమ




**భద్రాచలం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణంలో ఎస్ ఎన్ ఎం. జడ్పీహెచ్ఎస్ కొర్రాజుల గుట్ట భద్రాచలంలో కాంప్లెక్స్ స్థాయి బాలమేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జరిగిన సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి రామకృష్ణ మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ ద్వారా వెనుకబడిన పిల్లల యొక్క సామర్థ్యాలను వెలికి తీయవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి టి.రమ మాట్లాడుతూ బాలమేళాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల కనీస సామర్థ్యాలు వెలికి తీయవచ్చునని, విద్యార్థుల మధ్య పాఠశాలల మధ్య స్నేహపూర్వక పోటీ తత్వాన్ని ఏర్పరచవచ్చని తెలియజేశారు. ఉపాధ్యాయులు అందరు అంకితభావంతో పని చేస్తూ అందరు పిల్లలు కనీస సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేయాలని కోరినారు. కాంప్లెక్స్ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎన్నికైన, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జగదీష్ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజా శ్రీనివాస్ ని సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు రాజా శ్రీనివాస్ పాఠశాల ఉపాధ్యాయులు అందరి కృషి, కాలనీలోని విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో జగదీష్ కాలనీ పాఠశాలని మండలంలో ముందు ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ, ఎస్ఆర్ఎన్ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, రమేష్ చంద్, కృష్ణకుమారి ప్రధానోపాధ్యాయుల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సి ర్ పి రామకృష్ణ మరియు గోపి కృష్ణ, ఎం ఆర్ సి సిబ్బంది విజయ్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అందరికీ అసిస్టెంట్ సెక్రటరీ రామకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

# గొల్లపూడి రాకేష్‌ను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి





**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం త్రివేణి - కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ కుమారుడు వీర వేంకట రాకేష్ వివాహం, లక్ష్మీ ప్రణీత తో ఈనెల 23 ఆదివారం మంగళగిరి లో జరగనుంది. ఆ రోజు అందుబాటులో ఉండని కారణంగా తెలంగాణా రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందస్తుగా గురువారం రాకేష్ ను ఆశీర్వదించారు. మంత్రి పొంగులేటి కొత్తగూడెం లోని గొల్లపూడి జగదీష్ ఇంటికి వెళ్ళి రాకేష్ ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల మరో డైరక్టర్ మాచవరపు కోటేశ్వరరావు కూడా ఉన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పర్యటనలో భాగంగా త్రీ ఇంక్లైన్ లోనూ మరో వివాహ వేడుకకు మంత్రి పొంగులేటి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు

# ఉపాధి అవకాశం లేక అవస్థలు పడుతున్న వలస కూలీలు

## వలస కూలీలకు ఉపాధి అవకాశం కల్పించండి

## ఈద్గా కబరిస్తాన్ అధ్యక్షులు ఫహీమ్ దాదా



**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** రామవరం పరిరక్షణ కమిటీ చేపట్టిన నేను సైతం కార్యక్రమంలో భాగంగా గరిమెళ్ళ పాడు గిరిజన బిడ్డలకు ఈద్గా కబ్రిస్తాన్ కమిటీ సహకారంతో ఏడు కుటుంబాలకు సాయమందించారు కబ్రిస్తాన్ ఈద్గా కబ్రిస్తాన్ అధ్యక్షులు ఫహీమ్ దాదా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ముస్తఫా మాట్లాడుతూ మనమందరం కులమతాలకు అతీతంగా పనిచేయాల్సిన తరుణం ఏర్పడింది గరిమెళ్ళపాడు ఉపాధి లేక వలస కూలీలుగా మారడం ఎంతో బాధాకరమైన విషయం పూర్వ వైభవానికి మనమందరం కలిసి గరిమెళ్ళ పాడు గిరిజన బిడ్డలను ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ సంబంధిత అధికారులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే కృషి చేస్తామని వారు చెప్పారు సుమారు 72 ఎకరాల భూమి నిర్వీర్యం అవ్వడం ఎంతో బాధాకరమైన ఉభయ రాష్ట్రాలకు ఈ ప్రాంతం నుండి లక్షలలో మొక్కలు సరఫరా జరిగేది వంద కుటుంబాలకు ఉపాధి దొరికేది పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు వచ్చేవి ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని గరిమెళ్ళ పాడు కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ షమ్మీ, సెక్రెటరీ రసూల్, ఉపాధ్యక్షులు ఖయ్యూమ్, జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ గౌస్, మొయినుద్దీన్, వెంకటేశ్వర్లు, రాధా, సుజాత, తదితరులు పాల్గొన్నారు

# ఎంవిపాలెం పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఓ





**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 20:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి భాయ్ ఎంవి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ కనకదుర్గలను అడిగి తెలుసు కున్నారు. అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్క వ్యక్తికి బీపీ, షుగర్ స్క్రీనింగ్ చేయాలని, క్షేత్ర పరిధిలో సిబ్బంది అందరూ ప్రజలకు సేవలు అందించాలని డాక్టర్ కళావతి బాయ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎన్ చంద్రకళ , ఎల్ టి అజార్, ఎస్ఎన్ సంతోష్, ఫార్మసిస్ట్ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు

# ఆర్టీజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

■ టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్



**పాల్వంచ ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం టివిఏసి - జాక్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాదు లోని విద్యుత్ సంస్థల ప్రధాన కార్యాలయం విద్యుత్ సౌధకు వెళ్లి కష్టాలని విన్నవించు కుందామని వెళ్తున్న ఆర్టిజన్ కార్మికులను, నాయకులను రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం పోలీసులను ఉసిగొలిపి అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. జెన్కో ట్రాన్స్కో, డిస్కాం సంస్థలలో పనిచేస్తున్న సుమారు 20వేల మంది కార్మికులు తమను రెగ్యులర్ చేయాలని, ఒకే సంస్థలో రెండు సర్వీస్ రూల్స్ ఉండవద్దని, ఏ పీ ఎస్ ఈ బి సర్వీస్ రూల్స్ అమలు చేసి తమని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేస్తున్నారన్నారు. అయినప్పటికీ యాజమాన్యం కానీ, విద్యుత్ శాఖ మంత్రి కానీ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చొరవచూపకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. గత నాలుగు నెలలుగా శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు, బస్ యాత్రలు ఏ విధంగానైతే కొనసాగించారో, అదే పద్ధతిలో తమ సమస్యలు పరిష్కరించాలని పై అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని భావించి వారికి వినతిపత్రం సమర్పించుటకు వెళ్తున్న కార్మికులను, నాయకులను గత రాత్రి నుండి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడాన్ని టి యు సి ఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని, తెచ్చుకున్న తెలంగాణా లో ఇచ్చిన హామీని మరిచి గత కె సిఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న సుమారు 23,687 వేల మంది కార్మికులను ఆర్టిజన్ అనే పేరుతో విలీనం చేసుకొని, తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమైన పని ప్రదేశాలలో రెగ్యులర్ నియమకాలు చేపట్టాలని చట్టాలు చెబుతున్న వాటిని తుంగలోతొక్కి ఆర్టిజన్ అనే కొత్తపదం పేరుతో రెగ్యులర్ చేయకుండా నాలుగు గ్రెడ్ లుగా విలీనం చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా రేవంత్ రెడ్డి ఎన్నికలముందు గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించకుండా గాలికొదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, వెంటనే మీ అందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీని ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఈ సమస్యను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. హామీని నెరవేర్చమని అడుగుతున్న కార్మికుల పట్ల నాయకులపట్ల పోలీస్ ల జులుం సరికాదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం వారి సమస్యలపట్ల సానుకూలంగా స్పందించి, ఆర్టీజన్ కార్మికులను కన్వర్షన్ చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యను పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో ముందుముందు టివిఏసి - జాక్ ఆద్వర్యంలో చేసే ఆందోళనలకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మద్దతుగా ఉంటుందన్నారు.

# దేశమంటే అంబాని, అదానీలేనా ?

■ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే బడ్జెట్ తప్ప కష్టజీవులకు ఒరిగిందేమీలేదు

■ ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకులు డాక్టర్ డి.పాపారావు






**కొత్తగూడెం ఫిబ్రవరి 20 నవభూమి ప్రతినిధి:** కేంద్రం దృష్టిలో దేశమంటే అంబాని, అదానీలే తప్ప,సామాన్య ప్రజలు కాదని,కేంద్ర ప్రభుత్వం తరఫున ఎనిమిదవ సారి పార్లమెంట్ లో పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేదిగా ఉన్నదని,కష్టజీవులకు ఏమాత్రం ఉపయోగ పడనిదిగా ఉన్నదని ఆర్థిక రంగా విశ్లేషకులు డాక్టర్ డి.పాపారావు అన్నారు. కొత్తగూడెంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కమిటీల ఆద్వర్యంలో మచికంటి భవన్ లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సు కి ముఖ్య అతిథిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురుజాడ సూక్తి ని ఉటంకిస్తూ మాట్లాడారని, కానీ సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీల,రైతాంగానికి ఊరట ఇచ్చే విధంగా కానీ,కొత్త పథకాలు ప్రకటన కానీ,వారి కొనుగోలు శక్తి పెంచే నిర్ణయాలు కానీ ఈ బడ్జెట్ లో లేవన్నారు. పైగా అనేక రూపాలలో పరోక్ష పన్నులను భారీగా విధించారని అన్నారు. భారత దేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన 1991 సంవత్సరం నుండి వచ్చిన వరస బడ్జెట్ లను పరిశీలిస్తే కార్పొరేట్ లకు ఊడిగం చేస్తూ, సామాన్యులపైన, మధ్య తరగతి వర్గాలపైన భారాలను మోపే బడ్జెట్ లను తీసుకు వచ్చారన్నారు. రాను రాను క్రమక్రమంగా సామాజిక తరగతులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ వస్తున్నారని,ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వ ఆస్తులను,సహజ వనరులను దీ మానిటైజేషన్ ద్వారా వందల సంవత్సరాలు కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేసే నిర్ణయాలు ఈ బడ్జెట్ లో ఉన్నాయన్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థల మార్గ దర్శకత్వం లో విధానాలు పాలకులు రూపకల్పన చేస్తున్నారని, ఈ విధానాలు కాకులని కొట్టి గద్దలకు వేసే విధంగా ఉన్నాయని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కి ఈ బడ్జెట్ లో కేటాయింపులు గత బడ్జెట్ తో పోలిస్తే తొమ్మిది వేల కోట్లు తగ్గించారని అన్నారు.మధ్య తరగతి వర్గాలకి ఆదాయ పన్ను పరిమితి ని ఏడున్నర లక్షల నుండి పన్నెండు లక్షల రూపాయలకు పెంచారని,ఇది చూడటానికి పెంపుదలగా ఉన్నప్పటికీ ఈ సంవత్సర కాలం లో పెరిగిన ధరలతో పోల్చినప్పుడు ఇది ఏమాత్రం పెరుగుదల కాదని అన్నారు. కార్పొరేట్ లకు సంపద పన్ను విధించాలని డిమాండ్ చేశారు.రైతాంగం పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని అనేక ఆందోళనలు జరుగుతున్నా ఈ బడ్జెట్లోమాత్రం పట్టించుకోలేదని,పైగా మూడు నల్ల వ్యవసాయ చట్టాల్ని దొడ్డి దోవన అమలు చేయడానికి ఈ బడ్జెట్ మార్గం వేసిందని అన్నారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఏప్రిల్ నుండి అమలుకు పూనుకున్నారని అన్నారు.మరి పక్క కార్మిక వర్గం తమకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని పెద్ద ఎత్తున సమ్మెలు,పోరాటాలు చేస్తుంటే పరిగణన లోనికి తీసుకోలేదని అన్నారు.ధరల స్థిరీకరణ కి ఎటువంటి ప్రతిపాదనలు లేవన్నారు. ఇటువంటి విధానాలు అమలు చేసిన పాలకులను శ్రీలంక లో గత సంవత్సరం చివరిలో జరిగిన అధ్యక్ష,పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ప్రజల తరఫున పోరాడుతున్న కమ్యూనిస్టులను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారని అన్నారు. మన దేశంలో కూడా ఇటువంటి పరిణామాలు జరగడానికి ఎంతోకాలం పట్టదని, ఈ విధానాలుకు వ్యతిరేఖంగా ప్రజలంతా ఐక్యమై ఉద్యమాలు చేస్తే అటువంటి రోజు వస్తున్నాదన్నారు. ఈ సదస్సులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జె.రమేష్, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, యలమంచిలి వంశి కృష్ణ, కొక్కెరపాటి పుల్లయ్య, కున్సోత్ ధర్మా, దొడ్డ రవి కుమార్, కె.సత్య, ముదిగొండ రాంబాబు, ఉకంటి రవి, యస్. ఏ.నబీ, ఆలేటి కిరణ్, శెట్టి వినోద తదితరులు పాల్గొన్నారు

## ప్రజల రక్షణ కోసమే షీ టీం



**రామగిరి-నవభూమి:** ప్రజల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని షీ టీం ఇన్చార్జి ఎస్ఐ లావణ్య అన్నారు. రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో రామగిరి, బేగంపేట్ క్రాస్ రోడ్ లోని కాకతీయ స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్ లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీ ల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్ లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. అమ్మాయి లకు ఎలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, హెడ్ మాస్టర్ శ్రీధర్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## శివాజీ జయంతి సందర్భంగా, వినాయక విగ్రహం ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం

### వాసవీ క్లబ్ అధ్యక్షులు, బిజెపి పట్టణ కోశాధికారి విట్టలేష్ గుప్తా



**మెదక్ ప్రతినిధి నవభూమి-** మెదక్ పట్టణం చెందినవాసవి క్లబ్ పట్టణ అధ్యక్షులు, బిజెపి పార్టీ పట్టణ కోశాధికారి బెజుగం విట్టలేష్ గుప్తా నిరుపేదలకు సేవ చేయాలనే మానవత దృక్పథం తో వాసవి క్లబ్ పట్టణ అధ్యక్షులు, బిజెపి పార్టీ పట్టణ కోశాధికారి బెజుగం విట్టలేష్ గుప్తా గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకు సహాయం అందించాలనే దృక్పథం తో వివిధ సేవ కార్యక్రమంలు చేస్తున్నారు. దాంట్లో భాగంగా వినాయక చవితి కి స్థలం లేని నిర్వాహకులు ఇబ్బంది పడకుండా 24 వ వార్డులో బ్రాహ్మణ వీధి, ఫత్తేనగర్ చెందిన యువకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకోవాట్లని పేర్కొన్నారు.

## మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలకు రూ.15 లక్షల నిధుల మంజూరు

**వీపనగండ్ల ఫిబ్రవరి 21 నవభూమి-** వీపనగండ్ల మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో 15 లక్షలు నిధులు మంజూరైన సందర్భంగా భూమి పూజ కార్యక్రమానికి కస్తూర్బా పాఠశాలకు వస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ,,,విద్యార్థులు చదువును కష్టంగా భావించకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతిరోజు విద్యార్థులకు ప్రార్థన సమయంలో మహనీయుల చరిత్రను వివరించాలని దీనితో విద్యార్థులకు ధైర్యము, సాహసము, పట్టుదల పెరగడమే కాక నిరాశ లోను కాకుండా ఉంటారని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థులు భోజనం చేయడానికి కావాల్సిన డైనింగ్ హాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు..

# భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగొద్దు

### ■ తీర్థాల జాతర ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో ఆర్డీవో నరసింహారావు



**ఖమ్మం రూరల్, నవభూమి, ఏప్రిల్ 20:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో గల శ్రీ గంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి 'త్రివేణి సంగమం' (మున్నేరు) వద్ద ఈనెల 25వ తేదీ నుండి జనవరి ఒకటో తేదీ వరకు జరిగే (కూడలి) జాతర ఏర్పాట్లపై గురువారం ఆలయ ప్రాంగణంలో ఖమ్మం ఆర్డీవో నరసింహారావు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా జాతరలో ఏర్పాటు చేయనున్న మౌలిక వసతులు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీస్, ఎక్సైజ్, మెడికల్, ఎండోమెంట్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, అగ్నిమాపకం తదితర శాఖల ప్రధాన అధికారులు పాల్గొని వారి వారి శాఖల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నరసింహారావు మాట్లాడుతూ జాతర సమయంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముందుకు సాగాలన్నారు. ప్రధానంగా తాగునీరు, స్నాన ఘట్టాలు, బాత్రూములు, స్టాళ్లు, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, శానిటేషన్, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, బెల్ట్ షాపుల నివారణ, ప్రత్యేక పూజలు వంటి అంశాలలో అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో షిఫ్టులవారీగా సిబ్బందిని ఏర్పాటు చేసి జాతర విజయవంతం ఎందుకు కృషి చేయాలని ఆయన కోరారు. జాతరకు ముందుగానే వాటర్ ట్యాంకర్లను ప్రత్యేకంగా గుర్తించిన ప్రదేశాలలో ఉంచడం ద్వారా భక్తులు ఆ నీటిని వినియోగించుకుంటారని తెలిపారు. ఆలయ పరిసరాలలో ఎప్పటికప్పుడు శానిటేషన్ సిబ్బంది చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ట్రాఫిక్, పోలీస్ వాహనాల రాకపోకల నియంత్రణలో, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అరికట్టడంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని, అవసరం ఉన్నచోట విద్యుత్ స్తంభాలు నెలకొల్పి వీధి దీపాలు అమర్చాలని సూచించారు.

ఆర్టీసీ అధికారులు తమకు కేటాయించిన స్థలంలో బస్సులను స్టాండ్ చేసి ఎటువంటి ఆటంకం లేకుండా అక్కడి నుండే తిరిగి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిపిఓ ఆశాలత మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ నేపథ్యంలో జాతరలో కోళ్ల విక్రయాలను నియంత్రిస్తే బాగుంటుందని సూచించారు. అయితే కనీసం ఆలయ పరిసరాలలో కోళ్ల విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో బెల్ట్ షాపులు నియంత్రిస్తామని చెప్పగా ఆర్డీవో నరసింహారావు చుట్టుపట్టు గ్రామాలలో కూడా నియంత్రిస్తే బాగుంటుందని సూచించారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు మున్నేరులో సరిపడా నీరు ఉన్నదని, భక్తుల సౌకర్యార్థం జల్లు స్నాన ఘట్టాలను కూడా ఏర్పాటు చేయటంతో పాటు మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక హెూమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎండోమెంట్ అధికారులు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దాతలు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు ముందుకు వచ్చారని, అలాగే భక్తులను క్యూ లైన్ లో పంపించేందుకు స్కౌట్ సిబ్బంది సహకారాన్ని కూడా తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ప్రత్యేక పూజలు ఆలయం వెలుపల మాత్రమే జరుగుతాయని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఉండబోదన్నారు. అనంతరం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ తర్వాత పలువురు అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, తాసిల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఆలయ ఈవో శేషయ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.









# వీపనగండ్ల మండల కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

### ■ మంత్రికి వినతి పత్రం ఇచ్చిన గ్రామస్తులు

**వీపనగండ్ల ఫిబ్రవరి 21 నవభూమి-** వీపనగండ్ల మండల కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ ప్రజలు మేము రాండం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ వీపనగండ్ల మండల కేంద్రంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని దానికి అనుసంధానంగా 100 పడకల ఏరియా హాస్పిటల్ పెంచుతూ ఇక్కడ నర్సింగ్ కళాశాల ను ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉండేటటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు విద్యాపరంగా వైద్యాన్ని నేర్చుకొని పేద ప్రజలకు సేవలు అందించే విధంగా ఉంటుందని వారు ఆయనతో తెలిపారు. అదేవిధంగా పానగల్ వీపనగండ్ల చిన్నంబావి పెబ్బేరు మండలాలకు సంబంధించినటువంటి విద్యార్థినిలు అనేకమంది ఉదయాన్నే లేచి వనపర్తి కర్నూలు హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలలో లోని నర్సింగ్ కళాశాలలో విద్యను అభ్యసించే అవసరం ఏర్పడిందని వారు ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. మార్మూల ప్రాంతమైనటువంటి వీపనగండ్ల మండల కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఇక్కడ విద్యార్థినిలు సుదూర ప్రాంతాలకు



వెళ్లకుండా తమ సేవలు పేద ప్రజలకు అందించే అవకాశం ఉంటుందని ఆయనకు తెలిపారు. అలాగే మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యా వైద్యానికి ఎక్కువ నిధులు కేటాయించి ఈ ప్రాంతంలో అందరికీ వైద్యం విద్య అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇక్కడ ఉండే 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా హాస్పిటల్ గా తీర్చి దిద్దితే ఈ ప్రాంతంలోని ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయనకు తెలిపారు